
సాక్షి
తూర్పుగోదావరి
ఆదివారం | 28 | జనవరి | 2024



రూ.లక్ష విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమానికి ఎస్.గోవింద దాసు, సర్వలోకేశ్వరీదేవి దాసి దంపతులు (కాకినాడ) శనివారం రూ.లక్ష శాశ్వత విరాళం సమర్పించారు.



మృత్యువులోనూ వీడని బంధం

మృత్యువులోనూ వారి దాంపత్య బంధం వీడలేదు.. ఏడడుగులతో నూరేళ్లు జీవితాన్ని గడపాల్సిన ఆ దంపతులు అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు.

8లో

డెల్టాలకు 10,950 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 10,950 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.20 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

పరిశ్రమలకు రూ.29.88 లక్షల రాయితీ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని వివిధ పరిశ్రమలకు సుమారు రూ.29.88 లక్షల రాయితీ మంజూరు చేశామని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో పరిశ్రమల అభివృద్ధికి ముందుకు రావాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. వారికి సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసి, ప్రోత్సాహకాలు ఇస్తున్నామని తెలిపారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించామని చెప్పారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో 378 యూనిట్లు నెలకొల్పామని తెలిపారు. సమావేశానికి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫీజుకు తత్కాల్‌లో రేపటి వరకూ గడువు

రాజమహేంద్రవరం సిటీ: వివిధ కారణాలతో ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఫీజు చెల్లించని విద్యార్థులు తత్కాల్ స్కీము ద్వారా చెల్లించవచ్చని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్‌వీఎల్ నరసింహం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం 5 గంటల్లోగా రూ.3 వేల అపరాధ రుసుంతో ఫీజు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫీజు చెల్లించని ఇంటర్మీడియెట్ రెగ్యులర్, ప్రైవేటు, జనరల్, ఒకేషనల్ విభాగాలకు చెందిన విద్యార్థులకు ఈ అవకాశం కల్పించారన్నారు. ఇంకా ఫీజు చెల్లించని విద్యార్థులు వెంటనే చెల్లించేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులు ఆన్‌లైన్ పేమెంటు ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని తెలిపారు.

ఎంపీడీఓల బదిలీ

ఏలూరు (మెట్రో): ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీఓలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి తూర్పు గోదావరికి కె.శ్రీదేవి, జీఏకేఎస్‌వీ జ్యోతిరెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనోజ్, కె.వాణి, ఎం.అమిలుజమా, కె.వెంకటలక్ష్మి, ఎం.మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపాణి, ఎ.శ్రీనివాస్, కేఆర్ఎస్ కృష్ణప్రసాద్, టి.సూర్యనారాయణమూర్తిని బదిలీ చేశారు. అలాగే కృష్ణా జిల్లాకు కూడా పలువురిని బదిలీ చేశారు.

'మా నేత ఫొటో లేదేం?'

కొవ్వూరు: టీడీపీ నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో తమకు పరాభవం ఎదురైందని జనసేన శ్రేణులు మండిపడుతున్నాయి. వివరాలివీ.. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో సోమవారం చంద్రబాబు రా.. కదలిరా బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జనసేన, టీడీపీ నేతలు శనివారం సంయుక్తంగా కొవ్వూరులో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో చంద్రబాబు ఫొటో తప్ప, తమ అధినేత పవన్ కల్యాణ్ ఫొటో లేకపోవడంపై జనసేన శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. బ్యానర్‌లో తమ నేత ఫొటో ఎందుకు లేదని, ఇది తమకు అవమానంగా ఉందని కొందరు వ్యాఖ్యానించారు. ఈ సమావేశ వేదికపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీవీ రామారావు ఉన్నప్పటికీ ఈ విషయాన్ని ప్రస్తావించకపోవడంపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు పార్టీలూ పొత్తులో ఉన్నప్పుడు వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అని టీడీపీ నాయకులను జనసేన కార్యకర్తలు తప్పు పడుతున్నారు.

బాలబాలాజీకి భక్త నీరాజనం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి భక్తులు నీరాజనాలు పలికారు. స్వామివారిని శనివారం 3,571 మంది దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.2.08 లక్షల ఆదాయం వచ్చింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.60 లక్షలు, నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలుగా రూ.47.833 సమకూరాయి.

అమ్మచేతి గోరుముద్దలా..

- పోషకాలను అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద'
- రోజుకో రకం వంటకాలతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
- మూడు రోజులు రాగి జావ, ఐదు రోజులు కోడిగుడ్డు
- మెనూ ప్రకారమే వంటలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



పాఠశాలలో రాగి జావ తాగుతున్న విద్యార్థులు



భోజనం తింటున్న విద్యార్థినులు

కాకినాడ సిటీ: డ్రాపౌట్ల నివారణతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. అయితే, దీనిపై చిత్తశుద్ధి కొరవడటం, పర్యవేక్షణ లోపం కారణంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకం సరిగ్గా అమలు కాక, విద్యార్థులకు సరైన ఆహారం అందేది కాదు. వండిన పదార్థాలు నాసిరకంగా ఉండటంతో మధ్యాహ్న భోజనం చేయడానికి విద్యార్థులు అంతగా ఇష్టపడేవారు కాదు. ప్రజాసంకల్ప పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల ఆకలి బాధలను గమనించారు. గత ఎన్నికల్లో అఖండ విజయంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించగానే.. వారికి నాణ్యమైన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో గతంలో ఎన్నడూ చూడని మార్పులు చేశారు. జగనన్న గోరుముద్ద పేరిట విద్యార్థుల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారంతో నూతన మెనూ రూపొందించి, పక్కాగా అమలు చేస్తున్నారు. రోజుకో వంటకంతో నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. గతంలో వారానికి మూడుసార్లు కోడిగుడ్లు అందించే వారు. చాలాసార్లు అవి చెడిపోయేవి. వాటిని తినేందుకు విద్యార్థులు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం వారంలో వారానికి ఐదుసార్లు కోడిగుడ్లు అందిస్తున్నారు. ఏ వారంలో సరఫరా అయిన గుడ్లు అదే వారంలో ఉపయోగించేలా వాటిపై గుర్తులు వేస్తున్నారు. ఇలా ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

పారదర్శకత.. పర్యవేక్షణ

జగనన్న గోరుముద్ద అమలు బాధ్యతను పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. వీరితో పాటు పేరెంట్స్ కమిటీ సభ్యులు, సచివాలయ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కమిటీ ప్రతినిధులు కూడా ప్రతి రోజూ ఆహార పదార్థాల నాణ్యతను పర్యవేక్షిస్తున్నారు. ఆ తరువాతే విద్యార్థులకు ఆహార పదార్థాలు వడ్డిస్తున్నారు. ఎంఈఓలు కూడా రోజూ తమ పరిధిలోని ఒక పాఠశాలను సందర్శించి, నాణ్యతను పరిశీలిస్తున్నారు. తద్వారా ఈ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగింది



జగనన్న గోరుముద్ద అమలు నేపథ్యంలో పాఠశాలల్లో భోజనం చేసే విద్యార్థుల సంఖ్య పెరిగింది. పోషకాహారం అందిస్తూండటంతో పిల్లలు బడుల్లోనే భోజనం చేసేలా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తున్నారు. ఎంఈఓలు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో నాణ్యతలో రాజీ పడకుండా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య, జిల్లా విద్యాశాఖాధికారి

జగనన్న గోరుముద్ద మెనూ



సోమవారం : హాట్ పొంగల్, ఉడికించిన గుడ్డు, వెజిటబుల్ పలావ్, కోడిగుడ్డు కూర, చిక్కీ

మంగళవారం : పులిహోర, టమాటా పచ్చడి, దొండకాయ పచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగి జావ


బుధవారం : వెజిటబుల్ బిర్యానీ, ఆలూ కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

గురువారం: నిమ్మకాయ పులిహోర, టమాటా చెట్నీ, ఉడికించిన గుడ్డు, రాగి జావ

శుక్రవారం : అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

శనివారం : ఆకుకూర అన్నం, పాలకూర, కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, టీపీ పొంగలి, రాగి జావ

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల వివరాలు



	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	926	42,320
ప్రాథమికోన్నత	105	12,186
ఉన్నత	226	86,944
మొత్తం	1,257	1,41,450

రుచిగా వండుతున్నారు



నేను రోజూ మధ్యాహ్నం స్కూల్లో జగనన్న గోరుముద్ద తింటున్నాను. వారానికి ఐదు రోజులు కోడిగుడ్లు ఇస్తున్నారు. రోజుకో వెరైటీ కూరతో భోజనం పెడుతున్నారు. గతంలో స్కూల్లో భోజనం తినాలనిపించేది కాదు. ఇప్పుడు ఇంటి దగ్గర కంటే బడిలోనే రుచిగా ఉంటోంది. చదువుకోవడానికి, తినడానికి ఎలాంటి ఇబ్బందులూ లేవు. మా అమ్మానాన్నలు కూడా సంతోషంగా బడికి పంపుతున్నారు.

– కె.శ్రీలక్ష్మి, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

రాగి జావంటే ఇష్టం



వారంలో మూడు రోజులు ఇస్తున్న రాగి జావ అంటే నాకు చాలా ఇష్టం. స్కూల్‌కు వచ్చిన వెంటనే ప్రార్థన తర్వాత రాగి జావ ఇస్తున్నారు. మేమంతా ఇష్టంగా తాగుతున్నాం. మా అమ్మ కూడా రాగి జావ బలాన్నిస్తుందని చెప్పింది. ఏ రోజు ఏ ఆహారం పెడతారో మా స్కూల్ కిచెన్ గోడపై రాసి ఉంది. రుచికరమైన వంటకాలను అందిస్తున్న జగన్ మామయ్యకు థ్యాంక్స్.

– ఎస్.నిరంజన్, విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

కడుపు నిండా తింటున్నాం



పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగుంది. గతంలో కంటే ఇప్పుడు ప్రతి రోజూ ముందుగా నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి పెడుతున్నారు. మా స్కూల్లో ఒకరిద్దరు తప్ప అందరం కడుపు నిండా ఈ భోజనాన్నే ఇష్టంగా తింటున్నాం. రోజూ అన్నం, గుడ్డు, చిక్కీ ఇస్తున్నారు. దీంతో సాయంత్రం ఇంటికి వెళ్లే వరకూ ఆకలి తెలియడం లేదు.

– వి.పూజేశ్వరి, విద్యార్థిని, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

టైమ్ ప్రకారం ఆహారం



మా బడిలో ఇటు చదువు, అటు ఆహారం టైమ్ ప్రకారం జరుగుతున్నాయి. మధ్యాహ్న భోజనం కింద మాకు పెడుతున్న ఆహారంలో ఏయే పోషకాలున్నాయో పాఠ్యాంశాల ద్వారా తెలుసుకున్నాం. అప్పటి నుంచీ ఇంకా ఆనందంగా తింటున్నాం. గతంలో ఉండే మెనూలో చాలా మార్పులు చేయడంతో ఆహారం రుచిగా ఉంటోంది. మాలాంటి పేద విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమానికి కృషి చేస్తున్న జగన్ మామకు ధన్యవాదాలు.

– కేవీవీ నరసింహ, విద్యార్థి, జెడ్పీ ఉన్నత పాఠశాల, తూరంగి

జగన్ సిద్ధం అంటే వారికి దడ

- తెలంగాణలో నివాసం.. ఏపీలో రాజకీయ వ్యాపారం
- ఎంపీ భరత్‌రామ్ విమర్శ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధం అని శంఖారావం పూరిస్తూంటే ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని స్థానిక ఎంపీ, పార్టీ రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్‌లోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో తల దాచుకుంటూ ఐదేళ్లకోసారి ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఆంధ్రాకు వలస పక్షుల్లా వస్తున్నాయని విమర్శించారు. నైతికత లేని ఇటువంటి వలస పక్షులు మనకు అవసరమా అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. రాష్ట్రం విడిపోయినప్పటి నుంచీ చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి, షర్మిల హైదరాబాద్‌లోనే ఉంటున్నారని గుర్తు చేశారు. సింహం సింగిల్‌గానే వస్తుందని, నక్కలు, తోడేళ్లే గుంపులుగా వస్తాయని ప్రతిపక్షాలనుద్దేశించి ధ్వజమెత్తారు. గత ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిచిన వైఎస్సార్ సీపీ.. త్వరలో జరిగే ఎన్నికల్లో మరోసారి బంపర్ మెజారిటీతో విజయం సాధించడం, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా రెండోసారి సీఎం కావడం ఖాయమని చెప్పారు. ఏలూరులో జరిగే సీఎం జగనన్ బహిరంగ సభకు నగరం నుంచే 10 వేల మందికి పైగా పార్టీ శ్రేణులు, అభిమానులు తరలి వెళ్లబోతున్నామని ఎంపీ చెప్పారు.

మిత్రధర్మం అప్పుడేమైంది?

ఎన్నికల పొత్తులో భాగంగా టీడీపీ మిత్రధర్మం పాటించలేదని, అందుకే తానూ రెండు స్థానాలు ప్రకటించానని పవన్ కల్యాణ్ అనడం హాస్యాస్పదంగా ఉందని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. ఒకవైపు బీజేపీతో పొత్తు ఉందని చెబుతున్న పవన్.. టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నామని రాజమహేంద్రవరంలో బహిరంగంగా ప్రకటించినప్పుడు మిత్రధర్మం ఏమైందని ప్రశ్నించారు. 'బీజేపీతో చెప్పే ప్రకటించారా? ఇదేం మిత్రధర్మం' అని ప్రశ్నించారు. అసలు పొత్తులపై పవన్‌కే స్పష్టత లేదని, ఇక ప్రజలకేం స్పష్టత ఇవ్వగలరని భరత్‌రామ్ అన్నారు. పవన్‌ను టీడీపీ తోలుబొమ్మలా ఆడిస్తోందే తప్ప గౌరవం ఇవ్వడం లేదని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

జీవనోపాధికి ఇబ్బంది లేకుండా చర్యలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకారులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు. చిత్రంలో కలెక్టర్ మాధవీలత, జేసీ తేజ్‌భరత్, ఎస్పీ జగదీష్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ధవళేశ్వరం బ్యారేజీ పరిసరాల్లో చేపల వృత్తిపై ఆధారపడిన వారి జీవనం సజావుగా సాగడమే లక్ష్యమని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కాటన్ బ్యారేజీ వద్ద జువైనల్ రొయ్య విత్తనాల సేకరణ సమస్య పరిష్కారంపై తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ఉన్నతాధికారులు, ధవళేశ్వరం, బొబ్బర్లంక మత్స్యకార సంఘాల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చట్టానికి, నిబంధనలకు అనుగుణంగా నడచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారానికి ఇది అత్యంత అవసరమని చెప్పారు. చొరబాట్లకు తావు లేకుండా సమస్యను సామరస్యంగా పరిష్కారించడమే తమ ఉద్దేశమని, దీనికి ఇరు వర్గాలూ అంతే సానుకూలత చూపాలని విజ్ఞప్తి చేశారు.

కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు ప్రకారం లీజు కోసం దరఖాస్తు చేసుకోవాలని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని బొబ్బర్లంక మత్స్యకార సంఘాల ప్రతినిధులకు స్పష్టం చేశారు. చట్టబద్ధమైన లీజు హోల్డర్లకు అవసరమైన రక్షణ కల్పిస్తామని చెప్పారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుని వెళ్తామని తెలిపారు. బొబ్బర్లంకకు చెందిన ఎస్సీ మత్స్యకారులు తమ పరిధిలోకి చొరబడి, తమ కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని ధవళేశ్వరం ఎఫ్‌సీఎస్ సభ్యుడు ఇమ్మాన్యుయేల్ సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. బొబ్బర్లంకకు చెందిన ఎస్సీ మత్స్యకారుల ప్రతినిధి పార్ల కాలేపు మాట్లాడుతూ, దశాబ్దాల కాలంగా బ్యారేజీ పరిధిలోకి వలస వచ్చి జీవనోపాధి పొందుతున్నామని తెలిపారు. తమ హక్కులను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లీజు హక్కుల కోసం బొబ్బర్లంక వాసులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఈ సమావేశంలో అధికారులు సూచించారు. ఈ సమావేశంలో తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఎస్.తేజ్‌భరత్, శ్రీవాస్ నూపుర్ అజయ్, ఎస్పీ పి.జగదీష్, అదనపు ఎస్పీ ఖాదర్‌ఖాన్, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, కోనసీమ డీఎఫ్‌ఓ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ లిస్ట్‌పై అభ్యంతరాలకు 31 వరకూ గడువు

రాజమహేంద్రవరం రూరల్: ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి సంబంధించిన ప్రావిజనల్ మెరిట్ లిస్ట్‌ను జోన్-2 పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్లలో ఉంచారు. జోన్-2 ప్రాంతీయ వైద్య, ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పద్మా శశిధర్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ మెరిట్ లిస్ట్‌పై ఈ నెల 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా అభ్యంతరాలు తెలియజేవచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ అభ్యంతరాలను రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా zone2.mlhp2023@gmail.comకు ఈ-మెయిల్ ద్వారా కానీ తెలియజేయాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓ పోస్టుల భర్తీకి ఈ నెల 12వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించామని డాక్టర్ పద్మా శశిధర్ తెలిపారు.

రత్నగిరికి భక్తుల తాకిడి

- సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం



సత్యదేవుని దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలి రావడంతో స్వామివారి దర్శనం క్యూలైన్లు, వ్రత, విశ్రాంతి మండపాలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రదక్షిణ దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు పూజలు చేశారు. అనంతరం రావి చెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి, జ్యోతులు వెలిగించారు. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారు. రెండు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మందికి భోజనం పెట్టారు. భక్తుల ఏర్పాట్లను దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ పర్యవేక్షించారు. సెలవు దినం కావడంతో ఆదివారం కూడా దేవస్థానంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సుమారు 40 వేల మంది వస్తారనే అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆసరా తోడుగా...
ఆత్మీయత నిండుగా

ఒంటరి జీవితానికి వెలుగై..

ఈమె పేరు బొడ్డు రాఘవమ్మ. కాకినాడ రూరల్ వలసపాకలకు చెందిన ఈమె భర్త నూకరాజు చనిపోయాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాఘవమ్మ రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద చేపలు విక్రయిస్తూ ముగ్గురు ఆడపిల్లలను పెంచి, పోషించి చదివించడంతో పాటు పెళ్లిళ్లు చేసింది. ఒంటరిగా జీవిస్తున్న ఆమెకు వైఎస్సార్ ఆసరా ద్వారా ఏటా డ్వాక్రా రుణమాఫీ అందుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తోంది. తమ బాలాజీ గ్రూపునకు నాలుగు విడతలుగా రూ.4 లక్షల సాయం అందిందని, ఇది వ్యాపార అభివృద్ధికి తోడ్పడిందని రాఘవమ్మ చెబుతోంది. ప్రతి నెలా పింఛన్ అందుకుంటున్నానని, మళ్లీ జగన్ సీఎం కావాలని ఆమె కోరుకుంటోంది.


రమణయ్యపేట మార్కెట్ వద్ద చేపలు విక్రయిస్తున్న బొడ్డు రాఘవమ్మ

సంక్షేమ దివ్వెలు తీసుకు వచ్చిన జగనన్నపై అక్కచెల్లెమ్మల్లో ఆత్మీయత కట్టలు తెంచుకుంది.. ఆసరాగా మారిన మంచి మనసును ప్రతి గుండె అక్కున చేర్చుకుంటోంది.. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తూ నాలుగో విడత సొమ్ము విడుదల చేసిన ప్రభుత్వాన్ని ప్రతి మహిళా కీర్తిస్తోంది.. మా గుండె చప్పుడు నీవే జగనన్న అనే మాట అందరి నోట వినిస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం తమ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలిచిందని ప్రతి మహిళా అంటోంది.



–కాకినాడ రూరల్, ప్రత్తిపాడు రూరల్

ఆర్థికంగా లబ్ధి పొందుతూ..

ఈమె పేరు వెంకటదుర్గ. ప్రత్తిపాడు రూరల్ ధర్మవరం గ్రామం. పొదుపు సంఘంలో సభ్యురాలుగా చేరి బ్యాంక్ లింకేజీతో తీసుకున్న నగదుతో పాడి గేదెను కొనుగోలు చేసింది. దానిపై వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తుంది. వైఎస్సార్ ఆసరా పథకం కింద తమ గ్రూపునకు రూ.1.04 లక్షలు వచ్చిందని, నాలుగు విడతలుగా లబ్ధి పొందానని వెంకటదుర్గ చెబుతోంది. అంతేకాకుండా ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ సున్నా వడ్డీ, చేయూత పథకాలు అందడంతో ఆర్థికంగా ఆసరాగా మారిందని అంటోంది.

బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన గేదెతో మేడిబోయిన రాజు →



క్లుప్తంగా

నేడు రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో శ్రీగౌరీ శంకరుల ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. గ్రామంలోని పోలవరం కాలువ గట్టు మార్గంలో నిర్వహించే ఈ పోటీల్లో 50కి పైగా ఎడ్ల జతలు పాల్గొంటాయని వివరించారు. విజేతలకు మెమెంటో, నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎల్‌జీ ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్ విజేతకు బహుమతి


కేక్ కట్ చేస్తున్న విజేత వెంకటేశులు తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం సిటీ): ఎల్‌జీ ఇండియా కా సెలబ్రేషన్స్‌లో కాకినాడ జిల్లా గండేపల్లికి చెందిన రైతు కూలీ జి.వెంకటేశులు ఐకేసీ డ్రీమ్ హోమ్ ప్యాకేజీ గెలుచుకున్నారు. రూ.4.50 లక్షల విలువైన ఐదు రకాల ఎల్‌జీ గృహోపకరణాలను డ్రాలో పొందారు. ఎల్‌జీ ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్‌లో భాగంగా వెంకటేశులు ఈ బహుమతి సాధించారు. శనివారం రాజమహేంద్రవరం తాడితోట జంక్షన్‌లోని ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ షోరూమ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎల్‌జీ రీజినల్ మేనేజర్ కరాటం వెంకట కృష్ణాజీ బహుమతులను విజేతకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా కా సెలబ్రేషన్స్‌లో భాగంగా గత అక్టోబర్ నుంచి 58 రోజులు ఎస్‌ఎంఎస్ కాంటెస్ట్ నిర్వహించిందని తెలిపారు. ఇందులో రాష్ట్రంలో నలుగురు విజేతలుగా డ్రాలో నిలిచారన్నారు. ఒకటి గండేపల్లికి చెందిన రైతు కూలీ వెంకటేశులు ఐకేసీ డ్రీమ్ హోమ్ ప్యాకేజ్ విజేత కావడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌జీ రాజమహేంద్రవరం మేనేజర్ వీర, ఆదిత్య ఎంటర్‌ప్రైజెస్ యాజమాన్యం చంద్రమౌళి పాల్గొన్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

• రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల దుర్మరణం

అమలాపురం టౌన్: మృత్యువులోనూ వారి దాంపత్య బంధం వీడలేదు.. ఏడడుగులతో నూరేళ్ల జీవితాన్ని గడపాల్సిన ఆ దంపతులు అనుకోని ప్రమాదంలో అనంత లోకాలకు వెళ్లిపోయారు. అమలాపురం పట్టణ శివారు నుంచి ఉన్న 216 జాతీయ రహదారి బైపాస్ మార్గంలో రోళ్లపాలెం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పట్టణంలో గండువీధికి చెందిన ప్రస్తుతం బోడసకుర్రు టిడ్కో ఇళ్ల సముదాయంలో నివసిస్తున్న భార్యాభర్తలు గారపాటి వెంకట్రావు (55), మంగతాయారు (50) ఈ ప్రమాదంలో ప్రాణాలు విడిచారు. బైపాస్ రోడ్డు చెంత ఉన్న పిల్లావారి గరువులో ఉన్న తన కుమార్తె ఇంటికి వచ్చిన ఆ దంపతులు మోటారు సైకిల్‌పై తిరిగి బోడసకుర్రులోని ఇంటికి వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. రాజోలు వైపు నుంచి అతివేగంగా వస్తున్న మినీ వ్యాన్ వారి మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భర్త వెంకట్రావు అమలాపురం ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్నారు. మంగతాయారు గృహిణి. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కుమార్తె రాజేశ్వరికి పెళ్లి చేశారు.


మృతిచెందిన దంపతులు వెంకట్రావు, మంగతాయారు

కొత్త ఇంటి సరదా తీరకుండానే...

వెంకట్రావు కుటుంబం ఏడాది కిందటి వరకూ అమలాపురం గండువీధిలో ఓ అద్దె ఇంట్లో ఉండేది. ప్రభుత్వం బోడసకుర్రులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో ఓ ఫ్లాట్ ఇవ్వడంతో ఇటీవలే గృహ ప్రవేశమై ఆ కుటుంబం సంతోషంగా ఉంటోంది. కొత్త ఇంటి సరదా తీరకుండానే భార్యాభర్తలు కన్ను మూయడంతో టిడ్కో ఇళ్ల సముదాయం నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండో అమ్మాయి పెళ్లి చేసేందుకు ఇటీవల కాలంలో సంబంధాలు కూడా చూస్తున్నారు. ఆ ముచ్చట తీరకుండానే ఆ భార్యభర్తలు మృత్యుఒడిలోకి వెళ్లడాన్ని వారి ఆడపిల్లలు ఇద్దరూ తట్టుకోలేకపోతున్నారు. డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీన్ టాలెంట్ ఫెస్టివల్‌తో ప్రతిభ గుర్తింపు

శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్


టాలెంట్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న బూరుగుపల్లి రవికుమార్

రాజమహేంద్రవరం రూరల్: బాలభారత్ మహోత్సవ్ 'టీన్ టాలెంట్ ఫెస్టివల్'తో విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించడానికి వీలవుతుందని శశి విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. రాజమహేంద్రవరం శశి విద్యా సంస్థలు, సెంట్రల్ గవర్నమెంట్ అటానమస్ బాడీస్ ఆధ్వర్యంలో బాలభారత్ మహోత్సవ్ 'టీన్ టాలెంట్ ఫెస్టివల్'ను స్థానిక మోరంపూడిలోని బీఆర్‌కే ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. దీనికి 57 స్కూళ్ల నుంచి 1,800 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా టీన్ టాలెంట్ ఫెస్టివల్ తాము నిర్వహించామన్నారు. సృజనాత్మక పోటీలతో పాటు వర్క్‌షాపులు జరిపామన్నారు. పరిశ్రమలు పెట్టాలనుకునే వారికి, సినిమా విజువల్స్ నేర్చుకోవడానికి ఇది ఉపయోగపడుతుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డి.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగం చేయాలనే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇవ్వాలనే స్థాయికి ఎదగాలన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ఎస్‌కే సుబ్రమణి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ టైమ్ మెయింటెనెన్స్ చేస్తే విజయం సాధిస్తారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యువజన శాఖ అధికారి దూలం కిశోర్, నేషనల్ మ్యూజియం ఆఫ్ ఇండియా సినిమా మేనేజర్ జయితా గోష్, సీఈఓ, రెడ్డిషైన్ హెచ్‌ఆర్ కె.జాఫర్, సైకాలజిస్ట్ పీకేకే కౌశిక్, విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ లక్ష్మీసుప్రియ, అకడమిక్ డైరెక్టర్లు మన్నె వెంకటేశ్వరరావు, సీహెచ్ శేషుబాబు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట

ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని, దీనిపై ప్రతి పౌరుడు అవగాహన పెంచుకోవాలని ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా అన్నారు. శనివారం స్థానిక జాంపేట పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్, ఐసీఎస్‌సీఎస్ (ఇన్ఫోసెస్ కంప్లీ సొల్యూషన్స్) వారి సౌజన్యంతో రాజమహేంద్రవరం సీఐడీ, ప్రాంతీయ అధికారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అవేర్‌నెస్‌పై వర్క్‌షాప్ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా, సీఐడీ విభాగం అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు, ఫార్మర్ ఇన్ఫర్మేషన్ అండ్ సైబర్ సెక్యూరిటీ రీసెర్చర్ బి.శ్రీనివాస్‌లు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మిశ్రా మాట్లాడుతూ, చిన్న చిన్న చదువులు చదివిన వారే ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారని, వారిని ఎదుర్కోవడంలో ఉన్నత విద్య అభ్యసించిన వారు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతిక పరికరాలను ఉపయోగించే క్రమంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్క్‌షాప్ ఉద్దేశాలు, ఇతర వివరాలను సీఐడీ విభాగ అదనపు ఎస్పీ సీహెచ్ పాపారావు వెల్లడించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది, జీఎంఎస్‌కే కాలేజీ విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది, నెట్‌వర్క్ సర్వీస్ ప్రొవైడర్లు హాజరయ్యారు. సైబర్ నేరాలపై రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయడంపై సీఐడీ హెడ్ క్వార్టర్స్ అదనపు ఎస్పీ సీహెచ్ సురేష్, సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటర్నెట్, మొబైల్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఆర్థిక వ్యవహారాలు నిర్వహించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, తరచూ పాస్‌వర్డులు మార్చుకోవాలని వివరించారు. డీఎస్పీలు బి.రామకృష్ణ, సీహెచ్ పెంటారావు, ఇన్‌స్పెక్టర్ జీవీవీ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.బాలకృష్ణ, గోపాలకృష్ణ, డి.విజయకుమార్, పీవీవీ నరసింహారావు, ఎమ్.శేషు, వి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటేశ్వరావు, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ఎస్‌బీఐ డీజీఎం ప్రమోద్‌కుమార్ మిశ్రా

రేపటి నుంచి విద్యుత్ వినియోగదారుల అభిప్రాయ సేకరణ

రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో నిర్వహిస్తామని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ టీవీఎస్ఎన్ మూర్తి శనివారం తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ఎగ్జిక్యూటివ్ కార్యాలయం, రాజమహేంద్రవరం టౌన్, రాజమహేంద్రవరం రూరల్, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, రామచంద్రపురం, అమలాపురం, రంపచోడవరం డివిజన్ కార్యాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజూ అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తుందన్నారు. విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ ఉంటుందన్నారు. ధరలపై సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా ముందుగా దగ్గరలోని విద్యుత్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


మృతి చెందిన సత్యనారాయణ

అల్లవరం: ఓడలరేవు– కొమరగిరిపట్నం గ్రామాల సరిహద్దు ప్రాంతం సముద్ర తీరంలోని సరుగుడు తోటలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన విప్పర్తి వీరవెంకట సత్యనారాయణ (32) శనివారం ఉదయం సరుగుడు చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. విషయాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై హరీష్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబీకుల నుంచి వివరాలు సేకరించారు.